నేడు దోమకొండలో బీఆర్ఎస్ రోడ్ షో

దోమకొండ, ఏప్రిల్ 30 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు రోడ్ షో కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంధ్ర మధుసూదన్ రావు, పార్టీ అధికార ప్రతినిధి బుర్రి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్ షో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ హాజరు కానున్నట్లు తెలిపారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలపై దృష్టి సారించాలి

ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం

కామారెడ్డి, ఏప్రిల్ 30 : జిల్లా కేంద్రంలోని ఇంటర్ నోడల్ అధికారి కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వెల్లడైనఇంటర్ ఫలితాల్లో వైఫల్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. సబ్జెక్ట్, గ్రూప్ ప్రకారం రిజల్ట్‌ను కార్యాలయంలో పొందుపరచాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులను ఆన్‌లైన్ ద్వారా తరగతులను బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

బిల్లు చెల్లించాలని యువకుడి నిరసన

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 30 : కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయినా బిల్లు చెల్లించడం లేదని ఓ యువకుడు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రానికి చెందిన విజయ్ రెండేండ్ల క్రితం గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌ను రూ.30 లక్షలతో నిర్మించాడు. అయితే రూ.20 లక్షల బిల్లు చెల్లించారని 2022 నుంచి ఇప్పటివరకు మిగతా రూ.10లక్షల బిల్లు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీర్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి డీపీవో, డీఎల్పీవో వచ్చిన విషయాన్ని తెలుసుకున్న బాధితుడు అధికారులు లోపల ఉండగానే కార్యాలయం ప్రధాన గేటుకు తాళం వేశాడు. ఈ విషయమై డీపీవో కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ.. తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు రాసిస్తే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

డీపీవోతో మాట్లాడుతున్న విజయ్

గులాబీ జెండా ఎగురవేద్దాం

- ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్
- బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

బీబీపేట్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

బీబీపేట్, ఏప్రిల్ 30 : జహీరాబాద్ లోక్‌సభ స్థానంపై గులాబీ జెండాను ఎగుర వేసేందుకు బీఆర్ఎస్ సైనికులంతా కష్టాపడి పని చేయాలని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బీబీపేట్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలోని ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణలో అభివృద్ధి జరిగిందని, రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్‌వన్ స్థానంలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, నెలకు ఆడబిడ్డలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. పదేండ్లుగా ఎంపీగా ఉండి పది పైసల పని చేయ్యని వ్యక్తిగా బీబీ పాటిల్ నిలిచారన్నారు. బీఆర్ఎస్‌ను మోసం చేసి బీజేపీ లోకి చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయని పథకాలపై ప్రతి గ్రామంలో మీటింగులు ఏర్పాటు చేసి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అనంతరం మండలంలోని ఉప్పుర్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు బాల్‌రాజ్‌గౌడ్ తల్లి లక్ష్మీబాయి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, ఎంపీపీలు ఆంజనేయులు, బాలామణి, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాముండేశ్వరీ ఆలయంలో పూజలు

దోమకొండ, ఏప్రిల్ 30 : మండల కేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయాన్ని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి తీర్థప్రసాదాలను అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆలయ పరిధిలోని బోరు కోసం రూ.20 వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమాలు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంధ్ర మధుసూదన్‌రావు, ఎంపీపీ కానుగంటి శారదా నాగరాజు, సీనియర్ నాయకుడు కుంచాల శేఖర్, ఎంపీటీసీ సభ్యులు రమేశ్, శ్రీకాంత్, కిషన్‌రెడ్డి, శేఖర్, పోచయ్య, సాయిరెడ్డి, రవి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధుశర్మ పాల్గొన్నారు. – సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 30

రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం

కామారెడ్డి, ఏప్రిల్ 30 : ఖమ్మం జిల్లా సూర్యపేటలో గత నెల 28వ తేదీన నిర్వహించిన మూడో రాష్ట్రస్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ పోటీల్లో కామారెడ్డి జిల్లాకు చెందిన క్రీడాకారుడు ఈశ్వర్ అండర్-20 కేటగిరి 1500 మీటర్స్ విభాగంలో ద్వితీయ స్థానం(సిల్వర్ మెడల్) సాధించాడు. ఈ మెడల్‌ను సూర్యపేట జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి ప్రదానం చేశారని కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుడిని ప్రత్యేకంగా అభినందించారు.

చెట్టును ఢీకొన్న వాహనం

మాచారెడ్డి, ఏప్రిల్ 30 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామశివారులో తుఫాన్ వాహనం చెట్టును ఢీకొనడంతో ఏడుగురికి గాయాలైన సంఘటన మంగళవారం వేకువజామున చోటు చేసుకుంది. వివరాల ఇలా ఉన్నాయి. నాందేడ్ ప్రాంతానికి చెందిన 14 మంది తుఫాన్ వాహనాలో పుట్టువెంట్రుకలు తీయడానికి వేములవాడకు వెళ్తున్నారు. వాహనం ఘన్‌పూర్ గ్రామశివారులోకి చేరుకోగానే అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఏడుగురికి గాయాలైన వీరిని స్థానికులు అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణం కావచ్చన్నారు.

సంగోజీపేట్‌లో డెంగీ కేసు నమోదు

బాన్సువాడ, ఏప్రిల్ 30 : మండలంలోని సంగోజీపేట్ గ్రామానికి చెందిన మహిళ డెంగీ బారిన పడినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింట ఆరోగ్య పరీక్షల్లో భాగంగా బొంత పోచవ్వకు జ్వరం రావడంతో సదరు మహిళను బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు పరీక్షల నిమిత్తం ఆరోగ్య సిబ్బంది రిఫర్ చేశారు. జ్వరం తగ్గక పోవడంతో రక్తపరీక్షలు చేసి నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు పంపినట్లు సూపర్‌వైజర్ శోభ తెలిపారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పరీక్షల అనంతరం డెంగీగా తేలిందని అన్నారు. గురువారం సంగోజీపేట్ గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేపడుతామని తెలిపారు. సదరు మహిళ నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్నట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

బీమా చెక్కు అందజేత

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 30 : నస్రుల్లాబాద్ ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన కోట్ల మోహన్ కొన్ని నెలల క్రితం కరెంటు షాక్‌తో మృతి చెందాడు. రూ. లక్ష చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు విండో చైర్మన్ గంగారాం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్, ఐనాల లింగం, సంగమేశ్వర్ ఉన్నారు.

గిరిజన కుటుంబాల్లో వెలుగులు నింపింది కేసీఆరే

- నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి
- బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుపు ఖాయం

కన్నయ్యలాల్ తండాలో మాట్లాడుతున్న పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 30 : తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం గిరిజనుల సంక్షేమానికి కృషి చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని, బాన్సువాడ నియోజకవర్గంలో గిరిజనులకు సొంతింటి కలను సాకారం చేసేందుకు దాదాపు మూడు వేల డబుల్‌బెడ్‌రూం ఇండ్లను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మంజూరు చేశారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా మండలంలోని ఇబ్రహీంపేట్, ఇబ్రహీంపేట్‌తండా, కన్నయ్యలాల్ తండా, దేశాయిపేట్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ దుర్భిక్షంలోకి తీసుకెళ్లిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా పని చేసిన సురేశ్ షెట్కార్, పది సంవత్సరాలు బీఆర్ఎస్ ఎంపీగా పని చేసిన బీబీ పాటిల్ ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు వస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కన్నయ్యలాల్ తండాకు చెందిన గిరిజనులు బీఆర్ఎస్ అభ్యర్థికి పూర్తిమద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. ఉపాధిహామీ కూలీలకు మజ్జిగను పోచారం భాస్కర్‌రెడ్డి అందజేశారు. రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, మాజీ సర్పంచులు నారాయణరెడ్డి, ప్రేంసింగ్, శ్రావణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, నాయకులు గురువినయన్‌కుమార్, ఎజాస్, దొడ్ల వెంకట్రాంరెడ్డి, సాయిరెడ్డి, నారాయణరెడ్డి, గణేశ్, చందర్, పండరి, విఠల్, రాజిరెడ్డి, బాబూసింగ్ మహరాజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

బాన్సువాడ, ఏప్రిల్ 30 : నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా డీసీసీబీ మాజీ చైర్మన్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత పదేండ్లల్లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలు, ప్రజలను నేరుగా కలిసి ప్రచారాన్ని చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ రాబోవు రోజుల్లో చేపట్టే అభివృద్ధి పనులను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కల్యాణలక్ష్మి పథకంతోపాటు తులం బంగారం, 18 ఏండ్లు నిండిన ఆడబిడ్డలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామన్నారని, నెరవేర్చని హామీల గురించి ప్రజలకు వివరించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- కొనుగోలు కేంద్రాల పరిశీలన
- తూకం యంత్రాలు, రికార్డుల తనిఖీ

శివ్వానగర్‌లో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 30: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని శివ్వానగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ధాన్యంలో తేమశాతాన్ని కొలిచి, తూకం వేసే యంత్రాలు, రికార్డులను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని నిర్వాహకులకు సూచించారు. వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా కొనుగోలు చేసిన వెంటనే టాగ్ చేసిన రైస్‌మిల్‌కు ధాన్యం తరలించాలని సొసైటీ సీఈవోలు, కేంద్రాల మానిటరింగ్ అధికారులకు ఆదేశించారు. తూకం యంత్రాలను లీగల్ మెట్రాలజీశాఖ వారు తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వడగాలులు వీస్తున్నందున రైతులకు ఇబ్బందులు కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి ఆదేశించారు. అనంతరం ఆయన లింగంపేట మండలంలోని శెట్పల్లిసంగారెడ్డిలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరం మేరకు లారీలను అందుబాటులో ఉంచాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. మిల్లర్లతో సమావేశాలు నిర్వహిస్తూ కేంద్రాల నుంచి ధాన్యం వచ్చిన వెంటనే దించుకొని, ట్రాక్‌షీట్ అందజేయాలన్నారు. లారీలను వెయిటింగ్‌లో పెట్టవద్దని, కావలసినంత మంది హమాలీలను పనిలో పెట్టుకోవాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత రాకుండా ప్రతిరోజూ మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నిత్యానందం, ఎల్లారెడ్డి సొసైటీ సీఈవో విశ్వనాథం, ఐఈవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో హత్య

- భర్తతోపాటు మరో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ సంతోష్

వివరాలను వెల్లడిస్తున్న సదాశివనగర్ సీఐ సంతోష్

గాంధారి, ఏప్రిల్ 30: అనుమానంతో భార్యను హత్య చేసిన ఘటన గాంధారిలో చోటుచేసుకున్నది. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సదాశివనగర్ సీఐ సంతోష్ తెలిపారు. గాంధారి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గాంధారిలోని ఓ పాడుబడ్డ బావిలో మూడు రోజుల క్రితం కుళ్లిపోయిన మృతదేహం లభించిందన్నారు. అది గాంధారికి చెందిన బుర్రి కీర్తన(20) గా గుర్తించినట్లు తెలిపారు. లింగంపేట మండలంలోని కోర్పోల్‌కు చెందిన కీర్తనను తొమ్మిది నెలల క్రితం గాంధారికి చెందిన బుర్రి విజయ్‌కి ఇచ్చి వివాహం చేశారని తెలిపారు. వివాహం జరిగిన అనంతరం భార్యాభర్తలు ఓ ఇల్లును అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారన్నారు. కాగా.. భార్యపై అనుమానంతో విజయ్ తరచూ గొడవపడేవాడని తెలిపారు. నెలరోజుల క్రితం మరో వ్యక్తి(మైనర్)తో కలిసి కీర్తన గొంతు నులిమారని, అనంతరం ఆమె మెడకు టవల్ బిగించి చంపారని పేర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో ఉంచి గాంధారిలోని పాడుబడ్డ బావిలో పాడేసినట్లు తెలిపారు. కీర్తనకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఫిర్యాదు చేయలేదన్నారు. మూడు రోజుల క్రితం కీర్తన బంధువులు విజయ్‌ను నిలదీసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కీర్తన కనిపించడం లేదని ఫిర్యాదు చేశారని చెప్పారు. కీర్తనను విజయ్ హత్య చేసి ఉంటాడని అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరం అంగీకరించినట్లు తెలిపారు. అతడితోపాటు హత్యకు సహకరించిన మరో మైనర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. విలేకరుల సమావేశంలో గాంధారి ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు బాలాజీ, భానుచందర్ పాల్గొన్నారు.

మతం పేరుతో ఓట్లకు గాలం వేస్తున్న బీజేపీ

మాట్లాడుతున్న రాములునాయక్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 30: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఓటమి భయంతో మతం పేరుతో ఓట్లకు గాలం వేస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకుడు రాములు నాయక్ విమర్శించారు. ఎల్లారెడ్డిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవుడు అందరి వాడన్నాడు. బీజేపీకి నాలుగు వందల సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని అంటున్నారని తెలిపారు. ప్రజల పక్షంలో ఉండే కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించి, కేంద్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో నాయకులు కుర్మ సాయిబాబా, షేక్ గయాజుద్దీన్ పాల్గొన్నారు.

తాడ్వాయి మండలంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తాడ్వాయి మండలంలో మంగళవారం నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ త్వరలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం లారీ బోల్తా : తప్పిన ప్రమాదం

లారీ బోల్తా పడడంతో కిందపడ్డ ధాన్యం బస్తాలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 30: మండలంలోని అడ్విలింగాల గేటు సమీపంలో ప్రమాద వశాత్తు ఓ ధాన్యం లారీ బోల్తాపడింది. ఎదురుగా వాహనం వస్తుండడంతో డ్రైవర్ లారీని కొంచెం పక్కకు తీయడంతో ఈ ప్రమాదం జరిగింది. లారీ పూర్తిగా బోల్తా పడినా.. ఎవరికీ ప్రమాదం జరుగలేదని స్థానికులు తెలిపారు.

పోటీలో తలపడుతున్న మల్లయోధులు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

గాంధారి, ఏప్రిల్ 30: మండలంలోని మేడిపల్లిలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కుస్తీపోటీలు హోరాహోరీగా సాగాయి. చివరి పోటీలో విజేతకు వెండి కడియాన్ని బహూకరించారు.

ఎస్సెస్సీ ఫలితాల్లో మెరిసిన 'ప్రభుత్వ' విద్యార్థులు

ఏ.వైష్ణవి — సన — ఎం.పవిత్ర

ఎం.అనిత — శివభవాని — జి.బృంద

ఎల్లారెడ్డి/ పెద్దకొడప్‌గల్/ మద్నూర్/ రామారెడ్డి/ బీబీపేట్/ దోమకొండ/ భిక్కనూరు/ రాజంపేట, ఏప్రిల్ 30: ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఉత్తమ ఫలితాలు సాధించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ఎల్లారెడ్డి మండలంలో 91 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో వెంకటేశం తెలిపారు. మండలంలోని 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఉన్న 601 మంది విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్షలు రాగా.. 548 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. వీరిలో 288 మంది బాలికలు, 260 మంది బాలురు ఉన్నారని తెలిపారు. మండలంలోని ఐదు పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయని పేర్కొన్నారు.

పెద్దకొడప్‌గల్ మండలంలో మొత్తం 98శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలంలోని వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.అనిత మండల స్థాయిలో ప్రథమ, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన కె.మీనాక్షి, ఎం.శివభవానిలు ద్వితీయ స్థానంలో నిలిచారు. వడ్లం, కాటేపల్లి, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించగా.. పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాల 98.38 శాతం ఉత్తీర్ణత సాధించినిని తెలిపారు.

మద్నూర్ మండలంలో 85శాతం మంది విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి రాములు తెలిపారు. మండలంలో మొత్తం 606 మంది విద్యార్థులకు గాను, 515 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ముగ్గురు విద్యార్థులు లక్ష్మి, భువనేశ్వరి, శివాని 9.8 జీపీఏ సాధించారని తెలిపారు.

సదాశివనగర్ మండలంలోని కుప్రియాల్ గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థినులు ఎస్సెస్సీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రాగిణి తెలిపారు. ఏడుగురు 10 జీపీఏ, పది మంది 9.8 జీపీఏ, 43మంది విద్యార్థినులు 9కన్నా ఎక్కువ జీపీఏ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. బీబీపేట్ కేజీబీవీలో 45 మంది పరీక్ష రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 280 మంది విద్యార్థులు పరీక్షలు రాయ గా.. 260 మంది ఉత్తీర్ణత సాధించారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

దోమకొండ మండలంలో మొత్తం 457 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 450 మంది ఉత్తీర్ణత సాధించగా ఏడుగురు ఫెలయ్యారని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు.

భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన ఎస్‌కే సన 10 జీపీఏ సాధించింది. దీంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజంపేట మండలంలో మొత్తం 299మంది విద్యార్థులు పరీక్ష రాయగా 287 మంది పాస్ అయ్యారు. మొత్తం 95.98శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో రామస్వామి తెలిపారు.

ఊపందుకున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

ఎల్లారెడ్డి రూరల్/గాంధారి, ఏప్రిల్ 30: బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఎన్నికలకు మరో 13రోజులు మాత్రమే సమయం ఉండడంతో నాయకులు ప్రచారాన్ని ముమ్మరంగా చేపడుతున్నారు. లింగంపేట మండలంలోని బాణాపూర్, భవానీపేట్, ముంబోజీపేట్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనుల చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటేసి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, సంగమేశ్వర్, బండి నర్సింహులు, వివేకానంద, కిరణ్, నరేశ్, యాదగిరి, రాజేశేఖర్‌రెడ్డి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాణాపూర్‌లో..

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★SR ఆక్వా సొల్యూషన్స్, నిజామాబాద్ వాటర్ ప్యూరి ఫైయర్స్ నందు పనిచేయుటకు టెక్నిషియన్ (Male) కావలెను. Qual: ఇంటర్, జీతం + ఇన్సెంటివ్ సంప్ర॥ ✆ 98482 68883
NTZ-324910

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స